60th Year of Publication వజ్రోత్సవ సంవత్సరం

జమీన్ రైతు

ESTD. 1930
Regd No. H. NL.18
సంపుటి: 60 సంచిక: 49
8-12-1989
నెల్లూరు
శుక్రవారం
12 పేజీలు రూ 1.50

స్థాపకులు: నెల్లూరు వెంకట రామానాయుడుగారు * సంపాదకుడు: నెల్లూరు డోలేంద్రప్రసాద్ * మేనేజింగ్ ఎడిటర్: నెల్లూరు శ్రీరామమూర్తి

ఆదిలోనే అసంతృప్తి హంసపాదు!

రాష్ట్రంలో అధికారమార్పిడి జరిగిపోయింది; రక్తపాతరహిత విప్లవమంటారే. అట్లా గద్దెనెక్కింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఢిల్లీ పెత్తనానికి నేషనల్ ఫ్రంట్ పడుతున్న పాట్లు రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఎదురు కాలేదు. స్పష్టంగా, చెప్పాలంటే ఎన్. టి. ఆర్. ను సాగనంపి, కాంగ్రెస్‌ను వెనక్కు పిలిపించారు తెలుగు ఓటర్లు.

శాఖల పంపకంలో ముద్రగడ, జనార్ధనరెడ్డిలను అవమానపర్చారు

ముఖ్యమంత్రిత్వం ఎంపికలో రేగిన ఒత్తిడులు సమసిపోయి, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ఆడంబరంగా ప్రమాణస్వీకారం చేశారు. ఉత్సవం రాజ్‌భవన్‌లో కాక, నిజాం కాలేజీగ్రౌండ్స్‌లో జరిగింది. ఇది ఎన్. టి. రామారావు పెట్టిన సాంప్రదాయం. ఆరోజు కాంగ్రెస్‌పార్టీ ఆ ఆడంబరాన్ని నిరసించింది. కాని, తాను ఆనాటి కాంగ్రెస్‌లో లేను కాబట్టి, తనకు వర్తించదనుకున్నారేమో, చెన్నారెడ్డిగారు ఎన్. టి. ఆర్ ను అనుసరించారు. తలపాగా, ఎర్రటి కాశ్మీర్ శాలువాలు ధరించి వేషాలు వేయడంలో 'అన్న'కు 'చెన్నా' తీసిపోదనిపించారు.

ఆయనతో పాటుగా 18 మంది మంత్రులు పదవులు స్వీకరించారు. మంత్రుల ఎంపికలో ఆయన. జిల్లాలు, కులాలవారీ వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చారు. 11 జిల్లాలకు మంత్రివర్గంలో



ప్రాతినిధ్యమేలేదు. ఒకేజిల్లాకు 3 పదవులు లభించాయి. మంత్రివర్గ నిర్మాణం ఒకరకంగా చిక్కుసమస్యే! ఏడేళ్ళుగా అధికారంలో లేనందువల్ల ప్రతికాంగ్రెస్ వాదీ పదవులకోసం అర్రులుచాస్తున్నాడు. ఇంకొకప్రక్క తెలుగుదేశంనుండి వచ్చి చేరినవారిలో అధిక సంఖ్యాకులు మాజీ మంత్రులే! అందర్నీ సంతృప్తిపరచాలంటే మరొక అంజయ్య ఎయిర్‌బస్ తయారౌతుంది. ఎవర్ని కాదన్నా, అసంతృప్తి

మంత్రుల నియామకంలో తెలుగు దేశం మాజీలను దూరం చేశారు

మొదలై కాళ్ళక్రింద గోతులు త్రవ్వడం మొదలౌతుంది.

ఈ చిక్కుసమస్యను విడదీయడానికి, నెపం ఢిల్లీపై త్రోయడానికి చెన్నారెడ్డి ప్రయత్నించారు. కానీ ఢిల్లీ పెద్దలు తెలివిగా తప్పించుకున్నట్లున్నారు. వారికి చెన్నారెడ్డి సుఖంగావుండడంకంటే సమస్యలతో మునిగితేలడం అవసరం. అదీగాక చెన్నారెడ్డికి ఆప్తులైన [illegible] పురుషోత్తమరెడ్డి, సరోజినీపుల్లారెడ్డి, ఉమా వెంకట్రామిరెడ్డి వంటి వారు ఎమ్మెల్యేలు కాలేకపోయారు. తనకు నమ్మకస్తులైన వారిని ఎన్నుకోవడం ఆయనకు పెద్ద సమస్య అయింది.

ఇన్ని ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, ఎంతో జాగ్రత్తగా మంత్రివర్గం నిర్మించినా, మరుక్షణమే నిరసనధ్వనులు

—తరువాయి 7 వ పేజీలో

కాంగ్రెస్ కొంపకు చిచ్చు పెడుతున్నారు!

[illegible]

వ్యక్తులపై కోపంతో సంస్థను సర్వనాశనం చేస్తారా?

[illegible]

జమీన్‌రైతు

అవేతడబాట్లు'

నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఢిల్లీ పీఠం పెంనాధికారాన్ని స్వీకరించింది. అసంపూర్తిగానే అయినప్పటికీ వి. పి. సింగ్ తన మంత్రివర్గాన్ని ఏర్పాటుచేసుకోగల్గారు. సంకీర్ణమైనదేస్య స్వతంత్ర భారత చరిత్రలో ద్వితీయ కాంగ్రెసేతర ప్రభుత్వమిది; కాంగ్రెస్ వాదులుకాని ప్రధానులలో వి. పి. సింగ్ మూడవవ్యక్తి. 1979 లో జనతాపార్టీ ప్రయోగం విఫలమైనతర్వాత, పదేళ్ళకు జనతాదళ్ పార్టీ ప్రయోగం ప్రారంభమైంది. దురదృష్టకరమైన విషయమేమిటంటే- 1979 నాటిసీ, నేటికి ప్రతిపక్ష ప్రభుత్వపు నిర్మాణంలో, నిర్వహణలో పెద్దతేడా లేకపోవడం; అనాటి లోటుపాట్లు, తడబాట్లు ఈనాడూ పునరావృతం కావడం.

ప్రధాని పదవికి నాయకుని ఎంపికలోనే వీరు భ్రష్టుపట్టిపోయారు. మోసపూరితంగా చంద్రశేఖర్‌ను ప్రక్కకు తప్పించనిదే- ఎంపిక అసాధ్యంగా పరిణమించింది. దేవీలాల్ చిర్రుబుర్రులు శాంతింపచేయడానికి ఉప ప్రధాని త్వం కట్టబెట్టవలసివచ్చింది. ఈ మొత్తం తతంగాన్ని 'నేషనల్ ఫ్రాడ్' గా చిత్రించి, చంద్రశేఖర్ తన అసంతృప్తిని బయటపెట్టారు.

మంత్రులనియామకంలోనూ అంతే;దేవీలాల్, అజిత్‌సింగ్‌ల గొంతెమ్మకోర్కెలు తీర్చలేక ప్రమాణస్వీకారోత్సవాన్ని వాయిదా వేశారు. ఆ తర్వాత ఒకప్రక్క మంత్రులు ప్రమాణపత్రాలుచదువుతుండే, ఇంకొకప్రక్క మంత్రిగా నియమితులైన యశ్వంత్ సిన్హా రాష్ట్రపతి భవన్ నుండి వాకౌట్‌చేశారు.

ఆ ప్రక్కరోజుకూడా అదేపరిస్థితి. పిల్చినా, యశ్వంత్ సిన్హా రాకపోయేసరికి ప్రమాణస్వీకారోత్సవమే రద్దుచేయవలసివచ్చింది. శ్రీ సిన్హా చంద్రశేఖర్ అనుయాయుడు; ఆయనకు కేబినెట్ మంత్రిత్వం కావాలని కోరిక; వి. పి. సింగ్‌కు అది ఇష్టంలేదు. రాజీప్రయత్నాలన్నీ వ్యర్థమైపోయాయి.

పోర్టుఫోలియోలదింకొక పేచీ. అందరికీ ప్రధానశాఖలే కావాలి! ఎట్లావీలౌతుంది? దేవీలాల్ హోం అడిగాడు; అజిత్‌సింగ్ ఆర్థికశాఖ కోరాడు. ప్రస్తుతానికి వారిని ఒప్పించగల్గినప్పటికీ, ఈ శాంతి ఒప్పందం ఎంతకాలం అమలులోవుంటుందో ఎవరూ చెప్పలేరు. ఏ క్షణానైనా బ్రద్ధలయ్యే అగ్నిపర్వతం వంటి చంద్రశేఖర్ ఒకప్రక్క, చీటికిమాటికి అలిగి హఠంపట్టే దేవీలాల్, అజిత్‌సింగ్‌లు ఇంకొకప్రక్క- వి. పి. సింగ్ భవితవ్యాన్ని అయోమయంలో పెడుతున్నారు.

బి. జె. పి, వామపక్షాల మద్దతుకూడా గోదావరి ఈదడానికి తుక్కతోక పట్టుకున్నట్లే కన్పిస్తున్నది. ఏవిధాన నిర్ణయం తీసుకోవడానికైనా, వీరిద్దరి విధానాలలే పొసగవు. విదేశాంగ విధానంలోనే పీరిసపడడం కాయమన్పిస్తున్నది. ఒకరు ఎద్దెం అంటే, మరొకరు తెద్దెం అంటారు. అప్పుడే సి పి ఐ పార్టీ, లౌకికతత్వం కాపాడడానికి కాంగ్రెస్‌తో చేతులుకలపడానికి సిద్ధమేనని ప్రకటించింది.

క్షణక్షణగండం, బ్రతుకొకయుగంగా వి. పి. సింగ్ ప్రభుత్వాన్ని నడపవలసినదుర్గతి ఏర్పడింది. ఏ పార్టీ, ఏ నాయకుడు చక్రం అడ్డువేసినా ప్రభుత్వం కుప్పకూలిపోతుంది. అందర్నీ, అన్ని సమయాలలో సంతృప్తిపరచడం సాధ్యంకాదుకదా!

ఈ పరిస్థితులలో వి. పి. సింగ్ పరిపాలన ఏవిధంగా వుండబోతుందో ఎవరైనా సులభంగా వూహించుకోవచ్చు. ఏమిచేస్తానని ప్రజలకు ప్రమాణంచేసి పదవులలోకివచ్చారో, అవేవీ చేయలేరని స్పష్టంగా రుజువై పోతున్నది. అధికారంలోకి వచ్చినరాత్రే బోఫోర్స్ దొంగలను పట్టివేస్తామని ప్రగల్భాలుపల్కిన వి పి. సింగ్, ఇప్పుడు ఏమీచేయలేకపోతున్నారు. పంజాబ్ తీవ్రవాదులను విడిచిపెట్టగానే వారు ఖలిస్థాన్ నినాదాన్ని పునరుద్ఘాటించారు.

కలగూరగంపలాంటి పార్టీలుకలిసి ప్రభుత్వం నడపాలని చూస్తే జరిగేది ఇదే; కాంగ్రెస్‌పై కోపంతో భారతీయ ఓటరు తీసుకున్న నిర్ణయం దేశభవిష్యత్‌ను అంధకారబంధురం చేస్తుందా అన్న భయాందోళనలు కల్గుతున్నాయి. అరాజకం రేగుతుందా అన్న సందేహానికి తావు ఏర్పడుతున్నది.

జమీన్‌రైతు

8-12-1989

16 పేజీలు అణా

వెంకటగిరి పంచాయతీ ఎన్నికలు

ఓటర్లకు హెచ్చరిక

పసుపుపెట్టెలోనే మీఓటువేయుడు. ఓటింగు రహస్యపద్ధతిన జరుగుతుంది. ఒక గదిలో రెండు రంగుపెట్టెలుంటాయి. మీసద్ద యిచ్చిన ఓటుకాగితంపైన పేరుగాని, మరి యేలాటిగుర్తుగాని వుంచవు. గదిలోనికివెళ్లి మీకిష్ట మొచ్చిన రంగుపెట్టెలో ఓటు కాగితాన్ని వేయవచ్చు మీరు ఎవరికి ఓటిచ్చినది బ్రహ్మదేవుడుకూడా కనుక్కొనజాలడు. కాబట్టి దేశకల్యాణమునకోరే కాంగ్రెసు పసుపురంగు పెట్టెలోనే మీఓటు వదవేయండి—

ఇంకా గ్రుడ్డి బెదిరింపులా?

కాంగ్రెసు అభ్యర్థులకు ఓటిస్తే పుర్కోగాలు పీకేస్తామని గ్రుడ్డి బెదరింపులు చేస్తున్నారు రంగుపెట్టెల పద్ధతియని మరచారుగామాలు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పనులు అప్పుడే మరచిపోయినట్లుంది. కరు

50 ఏళ్ల క్రితం ఈ వారం

వులో అభిమానంకలిగితే ఓటిస్తారుగాని బెదరించి, ఓటుతీసుకోవాలంటే జరిగే పనేనా? చిత్తంబాబూ, మీరే మాటిల్లన్నీ తప్పితేస్తామని గుట్టుగా పసుపురంగు పెట్టెలో వేసేస్తారు.

ఓటరులారా! ఈ బెదరింపులకు జడియవలసిన పనిలేదు. నిర్భంధవడుస్తారని మొజమాటాలు తప్పించుకో లేమని భయపడితే నిరేశాని అనుకుని గుట్టుగా పసుపుపెట్టెలోనె మీ ఓటు వదవైచి ధన్యులుగండి—

—ఒక కాంగ్రెస్ సేవకుడు.

ఉదయగిరి తాలూకాలో కాంగ్రెసు ప్రచారము

శ్రీ [illegible] గోపాలరెడ్డి, వంగల్లు కోదండరామిరెడ్డి, కలమోరు చెంచు రామానాయుడు, రేబూరు సుబ్బరామిరెడ్డిగారలు క్రిందిప్రోగ్రాము ప్రకారం సంచారము గావించెదరు. అయా సెంటర్లకు సమీపంలోవుండు గ్రామస్తులు వచ్చి గ్రామ సౌకర్యముల అభివృద్ధిని గురించి తెలుపగోరుచున్నాము. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల గురించి కూడా ప్రచారము చేయుదురు. వరాః భోజన యేర్పాటులు ఎవరునూ చేయవనిలేదు.

బద్దెపూడి వెంకటనారాయణరెడ్డి,
జిల్లాకాంగ్రెస్ అధ్యక్షుడు.

చెన్నారెడ్డిగారూ- మా గోడు వినండి!

రాష్ట్రంలోని ప్రైవేట్ కాలేజి యాజమాన్యాలు పార్ట్‌టైం లెక్చరర్లచేత వెట్టి చాకిరీ చేయించుకుంటున్నాయి మామూలు లెక్చరర్లతోపాటూ మాకూ సమాన విద్యార్హతలున్నాయి వారితోపాటు మేమూ సమానంగానేపనిచేస్తున్నాము. కానీ ఏడేళ్ళనుండి మాకు ఉద్యోగభద్రత కల్పించడానికి ఏ యాజమాన్యమూ ముందుకు రావటంలేదు. కనీసం యు జి సి స్కేళ్ళ ప్రకారం జీతాలూ ఇవ్వడంలేదు. దినకూలీల మాదిరి రాలేదాలని మొత్తాలు చేతిలో పెడుతున్నారు.

1978 లో, డాక్టర్ మర్రి చెన్నారెడ్డిగారు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు అనాటి పార్ట్‌టైం లెక్చరర్లనందరినీ రెగ్యులర్ చేయాలని ఉత్తర్వు చేశారు. విద్యావంతుడు కాబట్టి, విద్యావేత్తల కష్టనిష్ఠూరాలను అర్థం చేసుకున్నాడాయన. ఇప్పుడు మళ్ళీ ఆయన ముఖ్యమంత్రి అయ్యారు కాబట్టి, మరొకసారి పార్ట్‌టైం లెక్చరర్లందరికీ వెట్టిచాకిరీనుంచి విముక్తి కల్పించాలని కోరుకుంటున్నాము. ఏడేళ్ళుగా అంధకారమయంగావున్న మా భవిష్యత్‌ను చక్కదిద్దాలని ప్రార్థిస్తున్నాము.

నెల్లూరు -ఎం. గరుడేశ్వరరెడ్డి
అధ్యక్షుడు,
రాష్ట్ర పార్ట్‌టైం లెక్చరర్ల సంఘం

విరిగిన సీట్లతో చిరుగుతున్న చొక్కాలు

నెల్లూరు సినిమా హాళ్ళలో సీట్లు విరిగిపోయి, కుషన్ ఊడిపోయి పరమ అధ్వాన్నంగా వుంటున్నాయి. కొన్నిటికి స్ప్రింగ్‌లుకూడా పైకిలేచి ఊగులాడుతున్నాయి. కూర్చొనే ప్రేక్షకులకు కల్గే అసౌకర్యం సంగతటుంచండి-చీలలు పట్టుకుని చొక్కాలు, ప్యాంట్లు చిరిగిపోతున్నాయి. థియేటర్ యాజమాన్యాలు టెక్కెట్ కుర్చీలవేసినా వద్దాలేదు-చొక్కాలచించే కుర్చీలను తక్షణం తొలగించాలని మనవి.

నెల్లూరు -కె. రవికుమార్

తప్పులుచేస్తే మీకూ ఓటమే గతి

ప్రజలను ప్రజానమస్యలను విడిచి పదవులకోసం కీచులాడుకున్నందువల్లనే 1988 లో ప్రజలు కాంగ్రెసును ఓడించి, ఎన్. టి. రామారావుకు పట్టం గట్టారు. కానీ ఆయనా దొరికినఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేక అవివేక నిర్ణయాలు తీసుకుని అన్నివర్గాల ప్రజలను దూరం చేసుకున్నారు. ఆయన నియంతృత్వం అందరికీ ఆగ్రహం తెప్పించింది. తమ ఆశలను, ఆకాంక్షలను వమ్ముచేసిందనే నిస్పృహతో ప్రజలు ఈ ఎన్నికలలో తెలుగుదేశాన్ని సంపూర్ణంగా తిరస్కరించారు. వేరే ప్రత్యామ్నాయం లేనందువల్లే వారు

జనవాణి

కాంగ్రెసుకు ఓటు వేశారన్నది వాస్తవం. దీనిజాన్ని విస్మరించక గుర్తించుకుని, ప్రజల సంక్షేమంకోసం పాటుపడకుంటే మళ్ళీ కాంగ్రెస్‌ను తిరస్కరించడానికి ప్రజలు సందేహించరని గ్రహించాలి. పరిపాలన, అభివృద్ధి ధ్యేయంగా జరిగితేనే కాంగ్రెసుకు భవిష్యత్తు

కావలి— వి. వి. నరసింహాచార్యులు

తనగొయ్యి తానే త్రవ్వుకున్నాడు

తెలుగుదేశం అధినేత శ్రీ ఎన్. టి. రామారావు ఓటమి కాంగ్రెస్ పార్టీ ఘనతేమీకాదు; చెన్నారెడ్డిగారి ప్రతిభ అసలే లేదు కర్తుడి ఓటమికి వున్న కారణాలవలె ఎన్ టి ఆర్ పతనానికికూడా ఎన్నో కారణాలు వున్నాయి. ఉన్నతాధికారులు మొదలు గ్రామాధికారులవరకు అందర్నీ దూరం చేసుకున్నాడు. గుడినే నమ్ముకుని బ్రతికే పూజారుల పొట్టకూడా కొట్టాడు, తన ఎమ్మెల్యేలను, మంత్రులను బానిసలలాగా చూశాడు; నియంతలాగా శాసించాడు; రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశాడు. ఇవన్నీ ఆయన స్వయంకృతాపరాధాలే. అహం, అవివేకం, అవినీతి, నియంతృత్వాలతో తన గొయ్యి తానే త్రవ్వుకున్నాడు.

నెల్లూరు -కూరపాటి వెంకటేశ్వర్లు

★

విద్యార్థి సంఘాలు నిర్వీర్యమైపోయాయి!

హోటల్ రేట్లపై అదుపేలేదు!

కాలేజీ విద్యార్థిసంఘాలంటే ఒకప్పుడు పలురకాల సమస్యలపై పోరాటం జరిపే సంస్థలుగా వుండేవి. హోటల్ రేట్ల విషయంలో కాదు అనేక సమస్యలేకాదు, ఒక్కో ప్పొత్తి, ఆంధ్ర రాష్ట్ర రాజకీయాలను కూడా ప్రభావితం చేసిన విద్యార్థి సంఘాలే! పెంపుడు, పటిష్ఠం చేయడమేకాకుండా, తమ స్వంత సమస్యలతో పాటు, ఇతరుల సమస్యలపై కూడా సమ్మెలు చేసి, అధికారులను లొంగదీసి, ఫలితం పొందుతుండేవారు విద్యార్థులు.

కానీ ఇటీవల కాలంలో నెల్లూరులో విద్యార్థి సంఘాలు మరీ నిర్వీర్యమై పోతున్నాయి. వేలకు వేలు ఖర్చు పెట్టి, ఎన్నికల్లో ఎన్నికలంత ఆగం చేసి, తమ్ముళ్ళు గాని, పోలీసుస్టేషన్ల కెక్కి, గెలవడం ఒకే ఒక విద్యార్థి సంఘం కార్యక్రమం అయిపోయింది. అంతకు మించి

సింహపురి

మన కాలేజీ విద్యార్థి సంఘాలు దేనికీ పనికి రాకుండా పోతున్నాయి. ఎన్నికల తర్వాత, అసలు స్టూడెంట్స్ యూనియన్లు వున్నాయన్న విషయమే గుర్తుకు రావడంలేదు.

హోటల్ రేట్ల పెరుగుదల, తగ్గింపు ప్రభావం వారికి అందరికంటే ఎక్కువగా గురయ్యేది విద్యార్థులు, ఉద్యోగులే! ఉద్యోగులంటే గానుగెద్దు బ్రతుకు. వారికి లేనిపోని ప్రత్యక్షంగా ప్రతిఘటించే ధైర్యం వుండదు. విద్యార్థులు పూనుకొంటేనే ఇటువంటి సమస్యలు పరిష్కారమౌతాయి.

నెల్లూరులో హోటల్ రేట్లు ఇటీవలి కాలంలో మరీ పెరిగిపోతున్నాయి. ఇది వరకు ప్రభుత్వమే రేట్లు నిర్ణయించేది. స్థానిక అధికారులు కూడా హోటల్ యజమానులను పిలిపించి, బేరసారాలు జరిపి రేట్లు నిర్ణయించేవారు. అటువంటి అదు

—కొరవ 8 వ పేజీలో

సణుగుడు

★ బ్రతుకు పోరాటం చూడాలంటే బొంబాయి నగరం పోవాలి!

బ్రతుకు పోరాటం చూడాలంటే బొంబాయి వెళ్ళాలి; సుఖంగా బ్రతకడానికి, సుఖంగా బ్రతుకుతున్నట్లు నటించడానికి, ఇంకా చెప్పాలంటే సుఖంగా బ్రతుకుతున్నట్లు ఇతరులను భ్రమింపచేయడానికి మనిషిపడే ఆరాటం చూడాలన్నా బొంబాయి పోవలసిందే.

మహానగరం అనే పదానికి నిర్వచనం బొంబాయే అవుతుంది. కలకత్తా గురించి నాకంతగా తెలియదుకాని, మహానగరపు స్వాభావిక లక్షణాలు బొంబాయిలో కన్పిస్తున్నంత స్పష్టంగా, నగ్నంగా నాకు మద్రాసు, ఢిల్లీలలో కనిపించలేదు. బొంబాయి ఒక నగరంకాదు. మహాజన ప్రవాహం; కాలుకదపనూ వీలులేనంత దట్టమైన జనారణ్యం; అదొక వింత ప్రపంచం!

పరమశివుడి చుట్టూ తిరిగితే ప్రపంచ యాత్ర చేసినట్లు. బొంబాయి నగరం చూస్తే భారతదేశాన్నంతటినీ చూసిన అనుభూతి కల్గుతుంది ఎవరికైనా. భారతదేశంలోని భిన్నమతాలు, భిన్న సంస్కృతులు, భిన్న భాషలు, భిన్న అలవాట్లు, ఆచారాలు, ఆర్థిక అసమానతలు, దారిద్ర్యపు నరకం, సంపన్నుల స్వర్గం, మధ్యతరగతి గానుగెద్దు జీవితం, పారిశ్రామిక ప్రగతి వైభవం, అంబరాన్ని చుంబించే ఆకాశహర్మ్యాలు, పాతాళానికి తొంగిచూసే గోతం పట్టల ఇళ్ల సమూహాలు, మెర్సిడెజ్ బెంజ్ కార్లు, చేతులతోలాగే మూటల బండ్లు... ఆర్థికంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా, సామాజికంగా, విద్యావిషయకంగా, మతపరంగా భారతదేశంలో కన్పించే పరస్పర విరుద్ధ పరిస్థితులన్నీ బొంబాయిలోనే కన్పిస్తున్నాయి మనకు. భారతదేశాన్ని ఇంత స్పష్టంగా, ఇంత సమగ్రంగా ప్రతిబింబించే మహానగరం మరొకటి వుండదేమో!

ఆ మహానగరపు రోడ్లపై నేను చక్కర్లు కొట్టిన సమయం పట్టుమని పదిహేను గంటలుకూడా వుండదు; కాని ఆ కొద్ది వ్యవధిలోనే బొంబాయి నగరపు కృత్రిమ జీవిత వాతావరణం వెగటుకల్గించింది. శతాబ్దాల చరిత్ర కల్గిన ఒక పట్టణాన్ని, ఒకేఒక్కరోజులో అనుభవించి పలవరించబోవడం దుస్సాహసమే అవుతుంది కాని; నెల్లూరువంటి చిన్నచిన్న టౌనులలోని నిత్య జీవిత సమస్యలను భూతద్దంలో చూచుకొని భయపడిపోయే మనం, బొంబాయి పౌరుల కఠిన జీవిత వాస్తవాలను తెలుసుకోవడం అవసరమనే అభిప్రాయంతోనే ఈ నాలుగు మాటలు చెప్తున్నాను.

బొంబాయి నగరంలో తొలిసారిగా అడుగుపెట్టే సగటు భారతపౌరుడికి, ఇది భారతదేశంలో అంతర్భాగమంటే నమ్మబుద్ధి కాదు. నీళ్ళలో తిరిగే చేపపిల్లను ఒడ్డుకు విసిరేసినట్లుగావుంటుంది. అక్కడి నిరుపేద, మధ్యతరగతి ప్రజానీకం దినచర్యను గమనిస్తే, దక్షిణభారతంలో మనమెంత సుఖంగా బ్రతుకుతున్నామో అర్థమౌతుంది.

రెండు మూడు అంతస్తుల్లో పక్కపక్కనే బెడ్‌రూము, మధ్యలో నిలబడి చేతులు చాపితే నాలుగుగోడలూ అందేటంత విశాలమైన గదులు, నిటారుగా నిలబడితే నెత్తి

శైలేంద్ర

పైన తొప్పవడే బాత్‌రూము. హాలు అవసరమే మరొక ఇరుకుగది కల్గిన ఇంటికి నెలకు 4 వేల రూపాయలు బాడుగ చెల్లిస్తున్నారు; ఇరవై అంతస్తులకు తక్కువ కాని ఒక్కొక్క భవన సముదాయంలో అటువంటి ఇరుకుగదులు 4 వందల వరకు వుంటాయి. ఇందికి కనీసం 50 వేల అడ్వాన్సు కట్టనిదే బాడుగకివ్వరట; పోష్ లొకాలిటీ అయితే బాడుగ అడ్వాన్స్ లక్ష దాటుతుందట. కొంచెం కల్గినవాడుండే ప్రాంతమైతే 'మెయింటెనెన్స్' క్రింద నెలకు 8 వేలు ముట్టచెప్పాలట. మెయింటెనెన్స్ అంటే- స్వీపరు, అంట్లుతోమే ఆయా, లిఫ్ట్‌బాయ్ వగైరా వగైరాలు వేళకు వచ్చి తంతుగా పనిచేసి పోవడమన్నమాట.

నెలకు రెండువేల జీతంతెచ్చుకునేవాడు నివసించేది క్రింది లెక్క. సిటీకి కనీసం 100 కిలోమీటర్ల దూరంలో వారి నివాసాలు. అక్కడా ఒకేఒక్క గది; అన్నిటికీ, అందరికీ అదే! బాడుగమాత్రం 700 నుంచి వెయ్యి వరకు తప్పక తప్పదు. అడ్వాన్సు పదివేలకు తగ్గదట; ఏ పది కుటుంబాలకో కలిసి ఒకేఒక బాత్‌రూం, లెట్రిన్; కాలకృత్యాలకు వేళలు ముందుగానే నిర్ణయించుకుంటారట. ఆ టైమ్ తప్పితే తొందరౌతున్నా బిందా బిగబట్టుకోవాల్సిందే- తప్పదు.

ఐదువేల రూపాయల ఉద్యోగస్తుడి

-కొరవ 10వ పేజీలో

మంత్రులిద్దరిమధ్య స్పర్థలు మంచిపనులకుపయోగపడాలి!

అదృష్టమో, దురదృష్టమో. ఈ జిల్లా లో ఇద్దరు మంత్రులైనారు. రాజకీయంగా ఇద్దరూ మేరువర్వతాలవంటివారు; రాష్ట్ర స్థాయిలో పలుకుబడి కల్గినవారు; రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలలోని అధికారులను ప్రభావితం చేయగల్గినవారు; ముఖ్యమంత్రిని బలవంతపెట్టి పనిచేయించగల్గిన స్తోమత గలవారు; మంత్రులుగా అపార అనుభవం కల్గినవారు.

ఈ ఇద్దరూ కలిసి కృషిచేస్తే నెల్లూరు జిల్లాలో దశాబ్దాల తరబడి కోర్కెలుగానే మిగిలిపోయివున్న పథకాలు కొన్నయినా కార్యరూపం ధరించే అవకాశంవుంది. కృష్ణపట్నంఓడరేవు వాటిలో అతిముఖ్యమైనది. రేవు అభివృద్ధి విషయంలో ఇప్పటికే చాలా ఆలస్యం జరిగింది; జిల్లాకు దానివల్ల చాలా అన్యాయమూ జరిగిపోయింది. నాయకులు వచ్చారు, పోయారు; ప్రభుత్వాలు గద్దె నెక్కాయి; దిగిపోయాయి! కాని కృష్ణపట్నం రేవు మాత్రం అన్నే అనాథగా అలనాపాలనకు నోచుకోని దౌర్భాగ్య పరిస్థితిలో వుండిపోతున్నది.

ఒక వ్యక్తిగా శ్రీ నాయుడు దశరథ రామరెడ్డి తన శక్తికి మించిన ప్రయత్నమే చేశాడు. లక్షలకు లక్షలు స్వంతడబ్బు ఖర్చు పెట్టుకున్నాడు. రెండుమూడేళ్ళ పాటు నిర్విరామంగా పనిచేశాడు. కానీ, ఎంత చిత్తశుద్ధి వున్నా ప్రభుత్వాలు చేయవలసిన పనిని వ్యక్తులెట్లా పూర్తి చేయగలరు? ఏ విధంగా సాధించగలరు? ఆయనా అలసిపోయినట్లున్నాడు - ఆగిపోయాడుకూడా!

కృష్ణపట్నం రేవు అభివృద్ధి చెందితే నెల్లూరుజిల్లాయే పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుంది. కొన్నివేల మందికి ఉపాధి దొరుకుతుంది. కాకినాడ, కార్వార్, మంగుళూరు నగరాలు ఎంతగా అభివృద్ధి చెందుతున్నాయో మన కళ్ళముందే కన్పడుతున్నదికదా!

మంచి రేవుగా అభివృద్ధి చెందడానికి అదృష్టంతప్ప కృష్ణపట్నానికి అర్హతలన్నీ వున్నాయి. ఇద్దరు మంత్రులలో ఎవరు పూనుకున్నా రేవులో ఏడాది తిరిగే సరికి ఓడలాగుతాయి. మొదలంటూ జరిగితే, ఆ తర్వాత అభివృద్ధిని ఎవరూ ఆపలేరు; దానంతటదే జరిగిపోతుంది.

మెడికల్ కాలేజి, బకింగ్‌హాం కాలువ పునరుద్ధరణకూడా మంత్రులుగా వీరి రాజకీయ జీవితాన్నయినా సార్థకము, చిరకీర్తి తెచ్చిపెట్టే పథకాలు. మంత్రులుగా తమకు దొరికిన అవకాశాన్ని, తమమధ్య వున్న స్పర్థలను అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రదర్శించగల్గితే, పోటాపోటీలు పడగల్గితే ఇద్దరి పేర్లనూ జిల్లా ప్రజలు ఎల్లకాలం గుర్తుపెట్టుకుంటారు; ఆకాశమెత్తున కీర్తిస్తారు.

జిల్లావార్తలు

ఎవరీ ప్రబుద్ధులు?

సి.పి.ఎం. కార్యకర్తలట. బుచ్చిరెడ్డి పాలెం నుంచి ఒక లేఖ వ్రాశారు. జక్కా వెంకయ్యగారు ఓడిపోతారని వ్రాసినందుకు జమీన్‌రైతు భరతం పడతామని బెదిరిస్తున్నారు. వారంలోగా మేము పోయి జక్కా వెంకయ్యగారిని కలవకుంటే, వారిని కీర్తిస్తూ వార్తలు వ్రాయకుంటే మమ్మల్ని వెంటాడి వేధిస్తారట.

ఎవరీప్రబుద్ధులు! ఎందుకీకారుకూతలు? చాటాకు చప్పుళ్ళకు బెదిరిపోయే కుందేళ్ళు కాదు-విలేఖరులంటే; వెంకయ్యగారూ-ఇటువంటి పిల్లచేష్టలను ప్రోత్సహించవద్దు!

పొట్టేపాళెం హత్య-పోలీసేమి చేస్తున్నది?

నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాళెంలో నెల్లక్రితం ఒక హత్య జరిగింది. లక్ష్మణరెడ్డి (60) అనే చిత్తూరుజిల్లా వాసి ఈ గ్రామంలో ఒక ముస్లిం స్త్రీ తో సంబంధం పెట్టుకుని, ఇక్కడే వుంటున్నాడట. ఆమెకు స్వంత భర్తకాక, మరొక హరిజనుడితోకూడా సంబంధం వుందట. ఈ ముక్కోణపు పోటీలో ఎవరో లక్ష్మణరెడ్డిని చంపి, శవాన్ని గోతం సంచిలో కుక్కి, పెన్నలో పారేశారట. మూడు రోజుల తర్వాత శవం తేలితే, గ్రామస్తులు చూసీచూడనట్లు ఊరుకున్నారట. ఆరాత్రి శవాన్ని ఎవరో ఒడ్డుకులాగి, తలను వేరు చేసి, ముక్కలుగా నరికి విసిరేశారట. అప్పుడు పోలీసు రంగంలోకి దిగి, పోస్టుమార్టం జరిపించి, కేసు దులుపుకున్నదట.

ముగ్గురితో కలిసి కాపురం చేస్తున్న ఆ 'మహిళారత్నం', తనతో సంబంధం వున్న హరిజనుడే లక్ష్మణరెడ్డిని ఒక అర్ధరాత్రి తన ఇంటి నుంచి పిల్చుకపోయాడని, ఆ తర్వాత మళ్ళీ శవంగా కన్పించాడని చెప్పిందట. కానీ పోలీసులుమాత్రం ఈ నెల రోజులలో ఎటువంటి విచారణ, దర్యాప్తు, అరెస్టులు వగైరాలు జరపలేదని తెలుస్తున్నది. ఆ హరిజనుడికి సి పి ఎం నాయకుల అండవుండడంతో పోలీసులు మౌనం వహిస్తున్నారని ఒక వదంతి. అతడు నెల తర్వాత యాంటిసిపేటరీ బెయిల్ తీసుకున్నాడట.

-కొరవ 8వ పేజీలో

పినాకినీ తీరం

"ఈ మంత్రిత్వాన్ని తీసుకోకుంటే ఏం?"

"స్వంతంతోనేవారు అప్రధానమైన శాఖతో అవమానించాలనే దురుద్దేశ్యంతో ఇవ్వబడిన ఆ మంత్రిత్వాన్ని జనార్ధనరెడ్డి గారు తీసుకోకుంటే ఏం? ధన్యవాదాలతో తిరస్కరించివుంటే ఎంత గౌరవప్రదంగా వుండేది? ఆయన ప్రతిష్ఠ ఎంతగా ఇనుమడించివుండేది?"

జనార్ధనరెడ్డిగారి అభిమానులు తమకు జరిగిన అవమానంగా భావిస్తూ, కుమిలి పోతూ, వేదనతో వేస్తున్న ప్రశ్న ఇది. రాజకీయ నాయకుల ఆలోచనలువేరు, వారి అనుయాయుల అభిమానుల అభిప్రాయాలు వేరు. ఆయన ఎందుకిచ్చారో, ఈయన ఎందుకు తీసుకున్నారో దూరంగా బయట వున్న మనలాంటివాళ్ళకేమితెలుసు? అది రాజకీయం; వదిలేద్దాం!

అది దురదృష్టమో, దురన్యాయమో కాని, జనార్ధనరెడ్డికి జరుగుతున్న అన్యాయాన్ని చూస్తుంటేకడుపుమండిపోతున్నది. రాజీవ్‌గాంధీగాని, ఎవరుగాని అంతన్యాయంగా అవమానించడానికి, అనాదరించడానికి, కఠినంగా శిక్షించడానికి ఆయనచేసిన తప్పేమిటి? ఆతనిలోని దోషమేమిటి? పార్టీకి ద్రోహం చేయకుండా దివారాత్రులు దాని పటిష్ఠతకు అవిరామంగా పనిచేయడమా? అగ్రనాయకత్వంపట్ల విధేయతతో విశ్వాసపాత్రంగా వుండడమా? రాష్ట్రంలో మొట్టమొదటగా ప్రధాని రాజీవ్‌గాంధీని పిల్చుకొనివచ్చి లక్షలాది ప్రజలనాకర్షించి కాంగ్రెస్ పట్ల ప్రజలలో వచ్చిన అనుకూలమైన మార్పును, రాజీవ్ నాయకత్వంపట్ల ప్రగాఢంగా వున్న ప్రజాభిమానాన్ని రాష్ట్రానికంతటికీ చాటిచెప్పినందుకా? ప్రదేశ్‌కాంగ్రెస్ అధ్యక్షుడుగా వున్న కొద్దికాలంలో రాష్ట్రంలో కాంగ్రెసుకు ఒకవూపును తీసుకువచ్చినందుకా? విశిష్టమైనవ్యక్తిత్వము, విలక్షణమైన కార్యసరళి, అపారమైన అనుభవము, అసదృశమైన నేర్పు ఓర్పులు, అపూర్వమైన దక్షత, ఎదురుదెబ్బలకు తలవంచి, అవమానాలనుదిగమ్రింగి దరహాసంతో వుండగలగడంవంటి సహజగుణాలు అతనిపాలిట అవలక్షణాలవుతున్నాయా? ఏదైనాగాని చిత్తశుద్ధిగలిగిన ఒకకాంగ్రెస్ వాదికి, ఎన్ని కష్టనష్టాలకు గురికావలసి వచ్చినా అవకాశవాదాన్ని దరిచేరనివ్వని నిజాయితీగలిగిన కాంగ్రెస్ వాదికి జరగకూడని అపకారం అన్యాయం అవమానం జరిగిపోతున్నది. పార్టీ సేవలో ముందుంటున్న జనార్ధనరెడ్డి పదవీ పోరాటంలో ప్రతిసారి అభిమన్యుడై పోతున్నారు. హృదయ విదారకమైన విషయం ఇది!

జనార్ధనరెడ్డి ఒక్కడే అవకాశవాది కాకుండా పార్టీ సేవచేసున్నాడనేది నా భావంకాదు. గత ఏడేళ్ళ తెలుగుదేశం నిరంకుశ పాలనను ఎదిరించి పార్టీప్రతిష్ఠను, బలాన్ని ఇనుమడింపచేసినవారు ఎందరో వున్నారు. డాక్టర్ వై. ఎస్. రాజశేఖర రెడ్డి, డాక్టర్ మైసూరారెడ్డి, రామభూపాల చౌదరి, మహమ్మద్ జాని, ధర్మారావు, పి. జనార్ధన రెడ్డి, నరసింహారెడ్డి, చెంగారెడ్డి వంటి యువకులెందరెందరో శాసనసభ ద్వారా అపూర్వరీతిలో కాంగ్రెస్ పేరు మ్రోగించారు. రోశయ్య, ద్రోణంరాజు వంటి వారు బయటవుండి విస్తృతంగా పర్యటించి తెలుగుదేశం పరువును తరిగి కాంగ్రెసుకు ఎంతోబలాన్ని చేకూర్చారు. ఇందిరా కాంగ్రెసుకు సంబంధించి పైన పేర్కొన్న వారందరికంటే సీనియరు జనార్ధనరెడ్డి.

-కొరవ 7వ పేజీలో

నెల్లూరు చుట్టుపట్ల

విహంగ వీక్షకుడు

ముఖ్యమంత్రి

ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తొలిసారిగా జిల్లాకు రాబోతున్నారు. 11 తేది ఉదయం ఆయన హెలికాప్టర్‌లో కండలేరునుంచి జిల్లాకు వస్తారు. కావలి, ఉదయగిరి, కలిగిరి, కొండాపురం చిలకూరు, ఉదయగిరి పర్యటిస్తారు. రాత్రికి ఉదయగిరిలోకాని, ఒంగోలులోకాని బసచేస్తారు.

జనార్దనరెడ్డి

వ్యవసాయ మంత్రి శ్రీ నేదురుమల్లి జనార్దనరెడ్డి 7 తేది ఉదయం తిరుపతి మీదుగా వెంకటగిరికి వచ్చారు; 8 తేది జిల్లా ప్రజా సమావేశం, ఇందిరా భవన్‌లో కార్యకర్తల సమావేశంలో పాల్గొని కావలికి వెళ్ళారు. శ్రీ పి వి రమణారెడ్డి అధ్యక్షతలో పూలవర్షంతో ఇందిరా భవన్‌లో ఆయనకు అఖండ స్వాగతం లభించింది.

9 తేది సూళ్ళూరుపేట, తడ, గూడూరు, చెన్నూరు; 10 తేది వెంకటగిరి, మేనకూరు వగైరా గ్రామాలు పర్యటిస్తారు; ఇప్పటివరకు ఖరారైన కార్యక్రమం ప్రకారం 11 తేది హైదరాబాదుకు పోవాలి; కాని సి ఎం పర్యటన వున్నందువల్ల ఆరోజుకూడా జిల్లాలో వుంటారేమో తెలియదు.

పోయినవి

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట బ్రిడ్జిదాటిన తర్వాత నా సైకిల్ వెనుక వుంచిన సంచి అందులోని అంగడి పుస్తకాలు, షాపు రైసెన్సు, తదితర కాగితాలు పోయినవి. దొరికినవారు మాకు చేర్చిన తగిన పారితోషికము ఇవ్వబడును.

పి. వి. సుధాకరరావు
ముశీక్యవ్య ఏజెన్సీస్
6/888, స్టోన్‌హౌస్‌పేట, నెల్లూరు-2

షాపురూములు బాడుగకు

నెల్లూరు శంకరాగ్రహారం
16/717, విజయశ్రీ లాడ్జి
ప్రక్కనున్న షాపురూములు
బాడుగకు ఇవ్వబడును.
వివరాలకు :
అదే ఇంట్లో మిద్దెపైన
సంప్రదించండి.

శ్రీనివాసులురెడ్డి

కేంద్రమంత్రి శ్రీ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి 6 తేది ఉదయం నెల్లూరు వచ్చారు; జిల్లా ప్రజా సమావేశంలో పాల్గొన్నారు; రాత్రికి తిరిగి హైదరాబాదు వైపు బయల్దేరారట.

మంత్రి పాలకపక్షం- కాంగ్రెస్ ప్రతిపక్షం?

8 తేది జరిగిన జిల్లా ప్రజాపరిషత్ సమావేశం చూపరులకు మంచి వినోద కాలక్షేపం అందజేసింది. జనార్దనరెడ్డి, శ్రీనివాసులురెడ్డి ఒకేవేదిక ఎక్కడం ఒక విశేషమైతే. కేంద్ర మంత్రిగారు పాలకపక్షం ప్రతినిధిగా, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రతిపక్షంగా వ్యవహరించడం ఇంకా వింత గొల్పింది.

జనార్దనరెడ్డిగారు అభివృద్ధికార్యక్రమాలను అందరం కలిసి అమలుజరుపుకొందామని పిలుపిచ్చారు; ముచ్చెమటలు పట్టిన మాట్లాడి దిగేశారు; శ్రీనివాసులురెడ్డిగారు మాత్రం జిల్లా మంత్రి తానే అయినట్లు భావించుకొని అందరి ఉపన్యాసాలలో కలగజేసుకొన్నారు. అధ్యక్షస్థానంలోవున్న తెలుగుదేశం ఛైర్మన్ డేగా నారసింహారెడ్డిగారి తరఫున ఆయనే సమాధానాలివ్వడం మొదలుపెట్టారు. తాను కేంద్ర మంత్రిగా వేసిన శిలాఫలకాలేవీ వృధాపోవడానికిలేదని అన్ని పనులూ అమలుజరగాలని అధికార్లకు హుకుం జారీచేశారు. 20 తేది గత మూడేళ్ళుగా తాను శంకుస్థాపించిన పనుల ప్రగతిని సమీక్షిస్తానని హెచ్చరించారు. మధ్యమధ్యలో మంత్రిపోజుతో అర్జీలుస్వీకరించి ఉత్తర్వులు వ్రాశారు ఇదంతాచూసేసరికి చురచుర మండిందేమో-శ్రీ మాదాల జానకిరాం లేచి, మంత్రిగారు మేము చెప్పింది వినాలితప్ప, ఆదేశాలు చేయడానికి లేదని గట్టిగామందలించడంతో శ్రీనివాసులురెడ్డి పేనా ప్రక్కన పారేశారు.

మర్రిపాడు మండల కార్యాలయాన్ని ఆ గ్రామంనుంచి మార్చాలని, ఉదయగిరి ప్రాంతంలో దేశం వాదులు చేస్తున్న ఆరాచకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని శ్రీ జానకిరాం కోరారు. ఇప్పటి వరకు జి ప్ర పలో నోరుకల్గిన వక్తగా శ్రీ ఎం. వి. నారాయణరెడ్డి వుండేవారు; ఇప్పుడు జానకిరాం తన వాగ్ధాటితో అందరినోళ్ళు మూయించేస్తున్నారు. ఎంతైనా 'ఆంధ్ర సేన' సింహంకదా!

రమేష్‌రెడ్డి రాజీనామా చేయడట

మునిసిపల్ ఛైర్మన్ శ్రీ టి. రమేష్‌రెడ్డి తాను తన పదవికి రాజీనామా చేయనని ప్రకటించారు. ఎవరో చెప్పిన సలహా విని, అనాలోచితంగా రాజీనామా ప్రకటన చేశారట రమేష్‌రెడ్డి. ఎన్నికల ప్రచారం తుదిఘడియలలో అనవసరంగా ఉద్రేకపడి తాను ఎన్నికలలో ఓడినా ఛైర్మన్ పదవికి రాజీనామాచేస్తానని ప్రకటించారు తీరా ఫలితాలు వచ్చినతర్వాత, అందుకు చేతులురావడంలేదు. ఎన్ టి ఆర్ సంప్రదించేవరకు రాజీనామా చేయబోవడం లేదని చెప్తున్నాడిప్పుడు.

రమేష్‌రెడ్డిని నెల్లూరు ఓటర్లు ఎమ్మెల్యేగా ఓడించారుగాని, ఛైర్మన్‌గా అభిశంసించలేదు. అయినా రాజీనామా చేయమని ఓటర్లేకాదు, ప్రతిపక్షంవారు కూడా కోరించలేదు. చేస్తానని తనేచెప్పారు, చేయననీ తనే ఇప్పుడు చెప్తున్నారు. ఎందుకీ అనవసర రాద్ధాంతం!

మునిసిపల్ ఛైర్మన్‌గా రమేష్‌రెడ్డి కొన్ని మంచిపనులు చేసివుండవచ్చుగాని; చేయదగినంత, చేయవలసినంత చేయడంలేదనేదిమాత్రం వాస్తవం. రానున్న రెండేళ్ళలోనైనా ఖద్దిగా, నెల్లూరులోనే వుండి, ఫుల్‌టైం ఛైర్మన్‌గా పనిచేయగల్గితే మంచి భవిష్యత్తు వుంటుంది.

రోటరీక్లబ్‌లో బెల్జియం టీం

బెల్జియం దేశానికి చెందిన రోటరీసభ్యుల బృందం ఒకటి ఇటీవల నెల్లూరు సందర్శించింది. 5 తేది సాయంత్రం నెల్లూరు నార్త్ రోటరీ సభ్యులు వారికి పర్మనెంట్ ఫండా హీసులో హార్దిక స్వాగతం చెప్పారు. సభను క్లబ్ అధ్యక్షుడు శ్రీ పి. రామమూర్తి అధ్యక్షించారు. రోటరీ గవర్నర్ శ్రీ జె వి రెడ్డి ముఖ్య అతిథ్యం నెరపారు. క్లబ్ కార్యదర్శి శ్రీ కలిమిలి శ్రీహరి స్వాగతం చెప్పారు. బెల్జియం ప్రతినిధులు శ్రీ హెరిక్రికసిమార్క్, శ్రీమతి దావోఫిలో, డాక్టర్ డయాస్‌లరీష్, శ్రీ లాంకన్స్ తదితరులు వచ్చారు వారందరికీ మెమెంటోలు సమర్పించారు.

6 తేది సాయంత్రం ఈ బృందం నెల్లూరు రోటరీక్లబ్‌ను సందర్శించింది. అధ్యక్షుడు శ్రీ డి. భరత్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన సభ; గవర్నర్ శ్రీ జె. వి. రెడ్డి, శ్రీ డి. ఎస్. రెడ్డి, శ్రీ కె బాలసుబ్రహ్మణ్యం, శ్రీ టి బి కె రెడ్డి తదితరులు మాట్లాడారు. కార్యదర్శి శ్రీ కొండా బలరామరెడ్డి బృందం సభ్యులకు మదర్ తెరెసా హోంను చూపించారు.

డెంటిస్ట్ డాక్టర్ మోహనరావుగారి కుమారుడు డాక్టర్ ప్రభాకరరావు అమెరికా నుంచి పంపిన 10 వేల రూపాయల నిధితో, వి ఆర్ కాలేజి విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇస్తామని శ్రీ బలరామరెడ్డిగారు సభలో ప్రకటించారు.

చక్కెరఫ్యాక్టరీ

కోవూరు చక్కెర ఫ్యాక్టరీలో 14 తేది నుంచి క్రషింగ్ ప్రారంభమౌతుంది. ముందు అనుకున్న ప్రకారం 8తేదీ ప్రారంభించాలనుకున్నారట. కాని వానలవల్ల 14 తేదికి వాయిదావేశారు.

అంకయ్యగౌడ్‌ను మళ్ళీ చేర్చుకున్నారు

పొదలకూరు మాజీ అధ్యక్షుడు శ్రీ రావుల అంకయ్యగౌడ్‌ను తిరిగి కాంగ్రెసులో చేర్చుకున్నారు. జె కె రెడ్డికి ప్రచారం చేసినందుకు ఆయన్ను ఎన్నికల సమయంలో పార్టీనుంచి తొలగించారు.

గౌడ్‌గారితోపాటు శ్రీ గౌస్‌మొహిద్దీన్, ఐనీరుద్దీన్‌లనుకూడా అప్పుడు పార్టీనుంచి బహిష్కరించారు; వారికింకా పునఃప్రవేశ ప్రాప్తి కల్గలేదు.

కాంగ్రెస్‌పార్టీలో ఎక్స్‌పల్షన్లు, సస్పెన్షన్లు చేయడమెంత సులభమో, రద్దు చేయడమూ అంతే సులువు.

లయన్స్ శిబిరం

నెల్లూరు లయన్స్‌క్లబ్ 8 తేది, రామచంద్రారెడ్డి పీపుల్స్ పాలీక్లినిక్‌లో ఉచిత, డయబెటిక్ చికిత్సా శిబిరం నిర్వహించింది. డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ నాగార్జున రోగులను పరీక్షించి, మందులిచ్చారు. క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సర్వనాథ్, కార్యదర్శి శ్రీ సత్యనారాయణ శిబిరం నిర్వహించారు. శ్రీ కె. శ్రీహరి స్వాగతం, శ్రీ ఎస్. కృష్ణగోపాల్ వందనాలు చెప్పారు.

టి వి చిత్రనిర్మాణం

నెల్లూరుకుచెందిన కొందరు ఔత్సాహిక కళాకారులు 'అరుణోదయ ఆర్ట్ క్రియేషన్స్' పేరిట ఒక టి వి చిత్రనిర్మాణ సంస్థ ప్రారంభించారు. తొలుత గా 'పొదుపు.పరువు' 'ప్రగతిపథం' అనే రెండుచిత్రాలు తీస్తున్నారట పిటిలో తొలి చిత్రానికి జిల్లాజడ్జి శ్రీ ఎస్. జయరామరెడ్డి క్లాప్ కొట్టారు. షూటింగ్ కోవూరు గెస్ట్ హౌస్‌లో జరిగింది.

పంచాయతీరాజ్ ఉద్యోగుల మొర

గుమాస్తా సర్వీసులోచేరి, గుమాస్తాగానే రిటైరైపోతున్న తమదీనస్థితిని తక్షణం పరిష్కరించాలని పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగులసంఘం నెల్లూరు జిల్లా నాయకుడు శ్రీ కె గోపాల్, చెన్నారెడ్డిగారికి విన్నవిస్తున్నారు మండలాలవల్ల తమ భవిష్యత్తు మరీ అధ్వాన్నమైపోయిందని, ఎం డి ఓ లకు సూపరింటెండెంట్లను నియమించమని ఉత్తర్వులున్నా అమలుజరగడంలేదని, పంచాయతీరాజ్ ఉద్యోగులు నిరాశా నిస్పృహలతో క్రుంగిపోతున్నారని ఆయన ముఖ్యమంత్రికి మొరపెట్టుకుంటూ, ఒక వినతిపత్రం పంపారు.

బస్‌దోపిడీ

పొదలకూరు సమీపంలో 6 తేది రాత్రి బందిపోట్లు ఒక ఆర్ టి సి బస్సు, రెండు లారీలను నిలిపి దోచుకున్నారు. రోడ్డుకు అడ్డంగా రాళ్ళుపెట్టి, వాహనాలను నిలిపి, కత్తులతో బెదిరించి దోచుకున్నారట.

నెల్లూరు జిల్లాలో దారిదోపిడీలు సహజమైపోతున్నాయి.

నీటిమట్టం

సోమశిల రిజర్వాయరు	22.49 టి.ఎం.సి.
,, క్రిందకు విడుదల	785 క్యూ.
కనిగిరి రిజర్వాయరు	20 . 0 అ.
సర్వేపల్లి ,, 8 తేది	9 . 8 అ.
నెల్లూరు చెరువు (8 తేది)	16 . 0 అ.

నెల్లూరు బజారు

మొలగొలుకు (8672) పుట్టి	2100.00
,, (9674)	2800.00
ఐ. ఆర్. 20 ,,	2000.00
సున్నాలు ,,	1800.00
మొలగొలుకు బియ్యం (70 కి)	280.00
బంగారు సవర (8 గ్రా.)	2440.00
వెండి (10 గ్రా.)	71.00

• శ్రద్ధాంజలి •

మా తల్లి దండ్రులకంటే మిన్నగాపెంచి, విద్యాబుద్ధులు నేర్పించి సంఘంలో మాకొక స్థాయిని కల్పించిన, మా మేనమామ, మానవత్వమున్న మంచిమనిషి

అల్లూరు గోవిందరెడ్డిగారు

లేబూరు

మమ్ము దుఃఖ సాగరమున ముంచి స్వర్గస్థులైన సందర్భంలో మా ప్రగాఢ శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

మేనల్లుళ్ళు - మేనకోడళ్ళు
పి. శంకరరెడ్డి డా॥ పి. శ్రీనివాసులురెడ్డి, ప. టిడాక్టర్,
గవర్నమెంట్ ఆస్పత్రి వెంకటగిరి, పి. గోపాలరెడ్డి,
ప్రమీలమ్మ, సులోచనమ్మ, అరుణ సోదరి : వెంకటసుబ్బమ్మ

పినాకినీతీరం

(5 వ పేజీ తరువాయి)

పార్టీ విషయంలోనేకాదు, ఇందిరాకాంగ్రెస్ వారి మంత్రివర్గంలో సభ్యులుగా కూడా చేసినవారే. డాక్టర్ బెజ్జా రెడ్డి ఆనాడు పి సి సి అధ్యక్షుడు, ఆ పార్టీ వారి ముఖ్యమంత్రి కూడా. కాని పదవులు పోయిన తర్వాత ఇందిరా కాంగ్రెస్‌కు నామం పెట్టి, కొత్త పార్టీ పెట్టి, పుట్టగతులేక ఇంట్లో అజ్ఞాతవాసంచేసి అకస్మాత్తుగా తెరపైకి తేలిన నాయకుడు నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి గారు అంటే, ఎప్పుడు ఏ పార్టీ గెలుస్తుందనుకుంటే అప్పుడు ఆ పార్టీ తరపునా, ఎప్పుడు ఏ నాయకుడు తనకు ప్రాధాన్యతనిస్తే అప్పుడు ఆ నాయకుడికి బ్రహ్మరథం పడుతూ చెలామణి అయిపోతున్న వ్యక్తి శ్రీనివాసులురెడ్డి. ఇటువంటి వారిలో చిన్న బిడ్డగా పరిగణించవలసినవారా జనార్దనరెడ్డి? ఇటువంటి వారితో సమానులుగా చూడవలసినవారా జనార్దనరెడ్డి?

1 తేదీ జరిగింది ఎన్నికకాదు, అభిప్రాయ సేకరణకాదు; అరాచకప్రహసనం, పన్నెండు గంటలపాటు రాష్ట్రంలోని రాజకీయాపరిశీలకులను, ముఖ్యంగా కాంగ్రెస్ వాదులను ఉత్కంఠతో ఉక్కిరి బిక్కిరి చేసిననాటకం, పచ్చిమోసం; అంతే! అఖిల భారత కాంగ్రెస్ పరిశీలకులువచ్చింది సభ్యుల అభిప్రాయాలను తెలిసికొని, తదనుగుణంగా ఫలితాన్ని నిర్ణయించి ప్రకటించడానికికాదు; ఢిల్లీ నాయకుని నిర్ణయాన్ని శాసించడంగా కాకుండా, నాజూకుగా సభ్యుల నెత్తిన రుద్దిపోవడానికి వచ్చిన పెద్దమనుషులు! లేకుంటే 178 మంది సభ్యుల అభిప్రాయాన్ని తెలిసికోడానికి అన్నిగంటలు పట్టవలెనా? ఒక శాసనసభ నియోజకవర్గంలో కొన్ని గంటల వ్యవధిలో లక్ష ఓట్లకుపైగా పోలవుతున్నపుడు, విద్యావంతులు చైతన్యవంతులైన 178 మంది శాసన సభ్యులు ఓటు వేయడానికి ఎంత సమయం కావాలి? రహస్య ఓటింగు పద్ధతిలో అభిప్రాయ సేకరణ జరిగి వుంటే అర్ధగంటలో పోటీచేసిన వారిలో ఎవరికి మెజారిటీ వచ్చింది తెలిసిపోయి వుండేది. కాని ముసుగులో మసిబూసి మారేడుకాయ జేసే రహస్య తంతుకోసం వల్ల అన్నిగంటల కాలం తీసుకున్నది!

స్థానికంగా పార్టీలో ముఠాలుండవచ్చు; వ్యక్తిగత కక్షలుండవచ్చు. కాని సమదృష్టితో చూడవలసిన కాంగ్రెస్ అధ్యక్షుడికి పక్షపాతం ఎందుకుండాలి? ఆయన దొంకతిరుగుడుమార్గాలెందుకవలంబించాలి? ఒకరి మనస్తాపానికి ఎందుకు గురికావాలి? పార్టీ శ్రేయస్సుదృష్టితో అనివార్యమై అవతలికంగా వ్యవహరించవలసివస్తే అర్థం చేసుకోవచ్చు కాని మామూలు పరిస్థితుల్లో సవ్యమార్గాన్ని ఎందుకు అనుసరించరాదు? అంతర్గతంగా స్వేచ్ఛగా ఎన్నిక జరిపి, మెజారిటీవచ్చిన వ్యక్తిని నాయకుడ్ని చేస్తే ఓడిపోయిన వ్యక్తి నోరెత్తడానికి అవకాశముండదు. బదులుగా ప్రజాస్వామ్యబద్ధంగా 'ఎన్నిక' పేరుతో నెత్తిన రుద్దిన మనిషిపట్ల అసమ్మతి తలెత్తడం ప్రారంభమవుతున్నది. దేశాన్ని ఇరవై ఒకటవ శతాబ్దంలోకి పురోగమింపజేస్తానని ఆశలు పుట్టిస్తున్న రాజీవ్‌గాంధీ అనుసరించవలసిన విధానం కాదిది. ఇదేకాదు; పద్దెనిమిదేళ్ళ యువతరానికి ఓటుహక్కు కల్పించడంద్వారా అభిమానులనుకున్న రాజీవ్‌గాంధీ అన్నిరాష్ట్రాల్లో నాయకత్వాలకు ఏడుపదులు దాటినవారిని ప్రవేశపెట్టడంద్వారా ఇటువంటి కలాపకు తొలిరోజుల్లోనే వెనక్కి తిరోగమిస్తున్నారు! శ్రీ ఎన్టీరామారావు కాంగ్రెస్‌కు అఖండ విజయం చేకూర్చి పుణ్యం కట్టుకున్నారు. పాత అప్రజాస్వామిక పద్ధతులను కొనసాగించి, కాంగ్రెస్ వాదులలోని వుత్సాహాన్ని చంపి, తిరుగా పార్టీ ఓటమికి కారకుడనే పాపాన్ని సంపాయించుకోబోతున్నారు రాజీవ్‌గాంధీ!

